క్లుప్తంగా

ఉత్సాహంగా ఎడ్లపందేలు

కొండాపురం: మండలంలోని కొమ్మి గ్రామంలో సోమవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాకు చెందిన వేనాటి వసుంధరరెడ్డి ఎడ్లు కమిటీ నిర్దేశించిన కనీస సమయం పది నిమిషాల్లోపు బండను 2,700 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. అలాగే ప్రకాశం జిల్లా అంకితరెడ్డిపల్లికి చెందిన దక్షిణ్‌రెడ్డి ఎడ్లు బండను 2,540 అడుగులు లాగి రెండోస్థానంలో, బాపట్ల జిల్లా మోక్షిత్‌రెడ్డి ఎడ్లు బండను 2,464 అడుగులు లాగి మూడోస్థానంలో, ప్రకాశం జిల్లా పొంగులూరు నాగేశ్వరరావుకు చెందిన ఎడ్లు బండను 2,400 అడుగులు లాగి నాలుగో స్థానంలో, ప్రకాశం జిల్లాకు చెందిన కత్తి నాగరాజు ఎడ్లు బండను 1,971 అడుగులు లాగి ఐదో స్థానంలో, ప్రకాశం జిల్లా వంగపాడు గ్రామానికి చెందిన వెంకట్రాయుడు ఎడ్లు బండను 1,779 అడుగులు లాగి ఆరో స్థానం నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందించారు. సీనియర్ విభాగంలో రాత్రి పొద్దుపోయే వరకు ఈ పోటీలు జరిగాయి.

13న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవానికి ముస్తాబవుతున్న పుష్కరిణి

అల్లూరు: స్థానిక అల్లూరు కోనేరు సెంటర్‌లో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 13వ తేదీ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీన కోనేరు సెంటర్ నుంచి హనుమాన్ శోభయాత్రలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ అల్లూరు పేట మీదుగా తిరిగి కోనేరు సెంటర్‌కు చేరుకుంటుందని తెలిపారు. 13వ తేదీ ప్రత్యేక పూజాలు, హోమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.


వైభవంగా పార్వేట ఉత్సవం



గ్రామోత్సవానికి సిద్ధమైన కోదండరాముడు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని దక్షిణపువీధి కోదండ రామాలయంలో జరుగుతున్న సీతారాముల ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం పార్వేట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

పరమేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో పరమేశ్వరుడు

ఉదయగిరి: మండలంలోని గుడినరవ శివాలయంలో సోమవారం భక్తులు పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



శరణ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కలిగిరి: స్థానిక పాతూరులో సోమవారం పొన్నం లక్ష్మీదేవి కుమార్తె శరణ్యకు చదువుల నిమిత్తం బలిజ చేయూత ఫౌండేషన్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ శరణ్య కలిగిరి జెడ్పీ హైస్కూల్లో చదివి 10వ తరగతిలో 544 మార్కులు సాధించిందని, ఫీజుల నిమిత్తం రూ.7 వేల ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఊసా మాల్యాద్రి, సుద్ధల మోహన్, రామ్మోహన్, ప్రకాష్‌రావు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వరవ కాలువ నీటి వృథా

- బాగు చేయిస్తే చెరువుకు పుష్కలంగా నీరు
- వర్షాలకు ముందే రిపేర్ చేస్తే మేలు



మురుగుకాలువగా మారిన చెరువు సప్లై చానల్

పొదలకూరు: ప్రతి సంవత్సరం వర్షాకాలంలో పొదలకూరు చెరువు వరవ (సప్లై చానల్) కాలువ నీరు వాగు పాలు అవుతున్నాయి. దీని నుంచి నీరు మధ్యలోనే లేఅవుట్ మీదుగా వాగులో పడి పార్లపల్లి చెరువుకు వెళ్తున్నాయి. పొదలకూరు, లింగంపల్లి రైతులు కాలువను బాగుచేయాలని చాలా పర్యాయాలు విజ్ఞప్తులు చేశారు. జలవనరుల శాఖ అధికారులు నామమాత్రపు మరమ్మతులతో సాగదీస్తున్నారు. ఏళ్ల తరబడి కాలువ గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు కాలువగా మారిపోయింది. పొదలకూరు చెరువుకు వరవకాలువ పట్టణం నడిబొడ్డున వెళ్తోంది. ఈ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది వర్షాకాలంలో నిండేందుకు పాతరోజుల్లో వరవకాలువ ప్రధానంగా ఉపయోగపడేది. పొదలకూరు – నెల్లూరు మార్గంలో కాలువ ప్రారంభమై పట్టణంలోని పలు ప్రాంతాల్లో మలుపులు తిరుగుతూ చెరువుకు చేరుకుంటుంది. పట్టణం విస్తరించి కాలువ కబ్జాకు గురైంది.

వర్షాలకు ముందే..

వర్షాలకు ముందే కాలువకు రిపేర్లు చేస్తే చెరువులోకి నీరు చేరేందుకు అవకాశం ఉంటుంది. చెరువు నిండేందుకు వరవ కాలువ ఒక్కటే ఆధారం. ఎడమగట్టు కాలువకు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేసినా చెరువుకు నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. దీంతో చెరువు నిండేందుకు కాలువపైనే ఆధారపడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే కాలువకు గండ్లు పడుతున్నాయి. పూడికతో నిండిన కాలువ గుండా చెరువుకు నీరు చేరాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఒకటి, రెండు పర్యాయాలు కాలువ పూడిక పనులు చేపట్టారు. తిరిగి కాలువ పూడికతో నిండిపోయింది.



కాలువకు గండిపడిన దృశ్యం (ఫైల్)

'ఫ్యామిలీ డాక్టర్'తో పేదలకు మేలు



మాట్లాడుతున్న వైద్య బృందం

కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని కొడవలూరు వైద్యాధికారి జి.బాలచంద్రబాబు తెలిపారు. మండలంలోని రామన్నపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటున్న ఒకరికి పరీక్షలు చేసి వైద్య సలహాలిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ బృహత్తర కార్యక్రమమని చెప్పారు. దీని ద్వారా చిన్నపాటి ఆరోగ్య సమస్యలను సైతం గుర్తించి వ్యాధి తీవ్ర రూపం దాల్చకముందే చికిత్స అందించడం జరుగుతోందన్నారు. గ్రామాల్లో వ్యాధి ప్రాథమిక దశలో ఉన్నప్పుడు ఆస్పత్రులకు వెళ్లకుండా తీవ్ర రూపం దాల్చే వరకూ ఉంటుండేవారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అలాంటి వారిని గుర్తించి చికిత్స అందించే బాధ్యత వైద్య సిబ్బంది తీసుకోవడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏ వెంకట్రావు, ఏఎన్ఎం శ్రావణి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

దెబ్బతింటున్న రోడ్లు

పొదలకూరు: రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు కొందరి కారణంగా దారుణంగా తయారవుతున్నాయి. రహదారులపై ఇనుమ చక్రాలు, ట్రాక్టర్లను ఇష్టానుసారంగా తిప్పుతుండడం వల్ల ఛిద్రమవుతున్నాయి. రైతులు పొలాల్లో దమ్ము కోసం ఆకు తొక్కే ఇనుప చక్రాలను లాక్కు వెళ్లడం వల్లనే రోడ్లు దెబ్బతింటున్నాయి. అంతేకాక రోడ్లను ఎక్కడపడితే అక్కడ అడ్డంగా తవ్వేయడం వల్ల కూడా గుంతలు ఏర్పడుతున్నాయి. ఇనుప చక్రాలను సాధారణంగా ట్రాక్టర్ ట్రక్కులో తరలిస్తే రోడ్లు దెబ్బతినేందుకు అవకాశం ఉండదు. అయితే కొందరు రైతులు ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంలో పొలం ఉన్నట్లయితే రోడ్లపై తోసుకుని వెళుతుంటారు. దెబ్బతింటున్నాయి. చక్రాల బరువుకు రోడ్లు గాడిలాగా ఏర్పడి కొద్దిరోజుల తర్వాత గుంతలు పడుతున్నాయి. దాదాపుగా మండల పరిధిలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తారు రోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది. వ్యవసాయానికి ఉపయోగించే ఇనుప చక్రాలను రోడ్లపై లాక్కు వెళ్లకూడదనే నిబంధనలున్నాయి.



నివాళులర్పించిన కాకాణి

పొదలకూరు: పట్టణానికి చెందిన మధుసూదన్ అనే వ్యక్తి మృతిచెందడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం నివాళులర్పించారు. మధుసూదన్ నెల్లూరు నగరం కొండాయపాళెం గేట్ వద్ద రైలు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాకాణి మధు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకాణి వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.



గాంధీ ఆశ్రమంలో కనకమ్మకు ఘన నివాళి



కనకమ్మ విగ్రహానికి నివాళులర్పించిన దృశ్యం

ఇందుకూరుపేట: మండలంలోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కన్వీనర్ కల్పనమ్మ ఆధ్వర్యంలో సోమవారం పొణకా కనకమ్మ జయంతి నిర్వహించారు. తొలుత కల్పనమ్మ, కమిటీ సభ్యులు గంపల మంజుల, బి.సుధారాణి కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ కనకమ్మ పల్లెపాడు పెన్నానది ఒడ్డున గాంధీ ఆశ్రమం కోసం 13 ఎకరాలు కొనుగోలు చేసి దానం చేసిన మహోన్నత వ్యక్తి అని చెప్పారు. రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్, ఆశ్రమ అడ్వైజర్ గుణపాటి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. ఆమె నాయకత్వంలో మైపాడుకు భారీగా మహిళలు తరలి వెళ్లారన్నారు. కమిటీ సభ్యుడు గణేశం దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కనకమ్మ ఎన్నో దాన ధర్మాలు చేశారన్నారు. బాలికా విద్య కోసం కస్తూర్బా విద్యాలయాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అనంతరం కల్పనమ్మ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు షేక్ అల్లాభక్షు, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, మేనేజర్ మనోజ్, దార్ల సుబ్రహ్మణ్యం, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాద స్థలం

కోవూరు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన ఘటన కొడవలూరు సమీపంలో మలిదేవి డ్రెయిన్ వద్ద సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంగం మండలం దువ్వూరుకి చెందిన కిట్టు, పండు, ప్రణయ్ అనే ముగ్గురు పని నిమిత్తం మోటార్‌బైక్‌పై నెల్లూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి ఢీకొని కింద పడిపోయారు. ముగ్గురికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

పోలీసుల కవాతు

సంగం: మండల కేంద్రమైన సంగంలో సోమవారం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జున రెడ్డి పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బస్టాండ్ సెంటర్‌లో ఇరు పార్టీల నాయకుల మధ్య జరిగిన ఘర్షణను దృష్టిలో పెట్టుకుని ఈ పోలీసు కవాతు చేపట్టారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

వరికుంటపాడు: పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని, గర్భిణుల బలవర్ధక ఆహారం తీసుకోవాలని మండల వైద్యాధికారిణి కరిష్మా సూచించారు. ఆమె సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకంలో భాగంగా 14 మంది గర్భిణులకు వివిధ రకాల వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలని తెలిపారు. అనవసరంగా స్కానింగ్ పరీక్షలు చేయించవద్దన్నారు. కాన్పు అయ్యేంత వరకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుశీలమ్మ, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం

ముత్తుకూరు: ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంజనేయస్వామి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. గజమాలలు, విద్యుద్దీపాల తోరణాల నడుమ ఆశీనులైన స్వామికి మేళతాళాలు, బాణసంచా వేడుకలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి అంగరంగ వైభవంగా బయలుదేరిన గ్రామోత్సవం ప్రధాన వీధుల్లో కొనసాగింది. భక్తులు అడుగడుగునా పూజలు చేసి, హారతులు పట్టారు. ఈదూరు రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఈదూరు ఇందిరమ్మ ఉభయకర్తగా వ్యవహరించారు.



వీరాంజనేయస్వామి గ్రామోత్సవం

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భిణికి సూచనలిస్తున్న సింధు మేఘన

కొడవలూరు: గర్భిణులు రక్తహీనత తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యల్లాయపాళెం వైద్యాధికారిణి సింధు మేఘన సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో సోమవారం 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపం వల్లే రక్తహీనత తలెత్తుతుందన్నారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్య రాకుండా నివారించుకోవచ్చని చెప్పారు. రక్తహీనత సమస్య వల్ల కాన్పు కష్టతరం కావడంతోపాటు తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉండలేరన్నారు. రక్తశాతాన్ని పెంచే ఆకుకూరలు, చిక్కీలు, పాలు సమృద్ధిగా తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. గర్భిణుల్లో బీపీ నియంత్రణలో ఉండడం అవసరమన్నారు. బీపీ పెరిగితే ప్రమాదకరమని గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయ, హెచ్ఈఓ కోటేష్, హెచ్ఎస్‌లు రజిత, సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు జాస్మిన్, రోజ్‌మేరి, సౌమ్య, రజిత, ఏఎన్ఎంలు సుకన్య, సుమతి పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి

కావలి: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనతను అధిగమించాలని వెంగళరావునగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ రమ్య సూచించారు. హెల్త్ సెంటర్‌లో డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు సోమవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో తరచూ ఎదురయ్యే రక్తహీనత సమస్య, కారణాలు, నివారణ, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవడం, వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవడం ద్వారా రక్తహీనతను సులభంగా ఎదుర్కోవచ్చని వివరించారు. అనంతరం డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తహీనతను అరికట్టే టానిక్‌లు, క్యాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ డి.మనోహర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణికి టానిక్ అందజేస్తున్న డాక్టర్ రమ్య

మలేరియా నివారణ మాసోత్సవాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యసిబ్బంది

సోమశిల: అనంతసాగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణ్, అశోక్, నాగేంద్ర, సబ్ యూనిట్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా అనంతసాగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తిచెంది మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరూ పరిశుభ్రత పాటించి మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలన్నారు. శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంట్లోని పాత్రలన్నింటినీ శుభ్రపరిచి నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు. ఎవరైనా రెండు రోజులకు మించి జ్వరంతో బాధపడుతుంటే వెంటనే పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు, సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌భాషా, పీహెచ్ఎన్ సుబ్బమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్యామలమ్మ, సత్యవతి, హెల్త్ అసిస్టెంట్లు షబ్బీర్, పెంచలరెడ్డి, ప్రసాద్, అబ్దుల్ ఖాదర్, ల్యాబ్ టెక్నీషియన్ మీరామొహిద్దీన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలే చిన్నారులకు రక్ష

- వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

దుత్తలూరు: గర్భిణులతోపాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే అధికశాతం మంది ప్రజలకు ఈ టీకాలపై సరైన అవగాహన లేక సమయానికి టీకాలు వేయించక అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ వ్యాధి నిరోధక టీకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

టీకాలు పొందడం ఇలా..

ప్రతి శని, బుధవారాలు చిన్నారులకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు వేస్తారు. గర్భిణులకు గర్భం దాల్చిన తొలి రోజుల్లో టీడీ–1 నాలుగు వారాలకు, టీడీ–2 చివరి గర్భధారణ, టీడీ బూస్టర్ మూడేళ్ల తర్వాత గర్భం దాల్చే వారు రెండు టీడీ మోతాదులు వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వీటితోపాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ మాత్రలు ఇస్తారు. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోస్ వేయాలి. వీటి వలన పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి చిన్నారులను కాపాడవచ్చు. 14 రోజుల వ్యవధిలో బీసీజీ టీకా వేయాలి. ఆరు వారాలు, 14 వారాల్లో ఐడీవీ చుక్కలు వేయాలి. వీటితోపాటు ఆరు వారాలు, 10–14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు పెంటావాలెంట్ వేయాలి. వీటి వల్ల కోరింతదగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు వ్యాధి రాకుండా చిన్నారిని కాపాడుకోవచ్చు. 9–12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మ్యూజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయాలి. 16–24 నెలల వ్యవధిలో బూస్టర్‌డోస్ డీటీటీ మ్యూజిల్స్, విటమిన్–ఏ, ఓపీడీ వేయాలి. ఐదు సంవత్సరాలు పూర్తయితే డీటీటీ ఒక డోసు వేయాలి. పది సంవత్సరాలు, పదహారు సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయాలి. 9 నెలల నుంచి ఐదేళ్ల వయస్సు లోపు ప్రతి ఆర్నెల్లకోసారి విటమిన్–ఏ 9 డోసులు వేయాలని వైద్యులు సూచిస్తున్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

అవగాహన అవసరం

గర్భిణులకు, చిన్నారులకు నిర్దేశిత వేళల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వాటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ టీకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

– డాక్టర్ అయూబ్‌అఫ్సర్,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దుత్తలూరు